ఈనాడు
నారాయణపేట
సోమవారం అక్టోబరు 21, 2024

చేనేత కార్మికులకు రూ.50లక్షల చెక్కు అందజేత



చేనేత కార్మికులకు చెక్కు అందిస్తున్న ఎస్‌బీఐ ఆల్ ఇండియా ఛైర్మన్ చల్లా శ్రీనివాస్ శెట్టి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామానికి చెందిన చేనేత కార్మికులకు ఎస్‌బీఐ ఆల్ ఇండియా ఛైర్మన్ చల్లా శ్రీనివాస్ శెట్టి ఆదివారం 50లక్షల చెక్కును అందించారు. హ్యాండ్లూమ్స్ వివర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు నరసింహులు ఎస్‌బీఐ ఛైర్మన్, రీజియన్ మేనేజర్ అనిల్ కుమార్‌కు విన్నవించారు. స్పందించిన చల్లా శ్రీనివాస్ శెట్టి ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యక్తి కావడంతో చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి సహాయానికి అంగీకరించారు. స్వగ్రామం వనపర్తికి వచ్చిన సందర్భంగా చెక్కును కార్మికులకు అందించారు. సహకరించిన ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్‌కు, కోటకొండ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌కు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యానికి రక్షణేదీ?

కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాల కరవు



గోటూర్ శివారులో దారి పక్కన ఆరబెట్టిన ధాన్యం


ధన్వాడ, న్యూస్‌టుడే : రైతులు పండించిన పంటను కాపాడుకునేందుకు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు కనీస వసతులు లేక వర్షం వస్తే ధాన్యం తడిసి తీవ్ర నష్టాలపాలవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏటా కొనుగోలు కేంద్రాల సంఖ్య పెరుగుతున్నా.. వసతులు మాత్రం మెరుగుపడడంలేదని వాపోతున్నారు.



వర్షానికి తడిసిన ధాన్యం చూపుతున్న మహిళా రైతు

3.52 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం.. : ఈసారి జిల్లాలో 3.52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 1.89 లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకం, 1.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకానికి సంబంధించింది. వీటి కొనుగోలుకు 102 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో 60 పీఏసీఎస్(సింగిల్‌విండోలు), 40 ఐకేపీ, రెండు మెప్మాకు చెందినవి ఉన్నాయి. అయితే ఈ సంస్థలకు జిల్లాలో ఎక్కడా ప్లాట్‌ఫారమ్‌లు లేవు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేసుకోవడానికి సరిపడా గోదాములు, వే బ్రిడ్జిలు లేవు. దీంతో కొనుగోలు చేసిన ధాన్యం లారీలు వచ్చే వరకు ఆరు బయటే నిల్వ చేయాల్సి ఉంటుంది. ఐకేపీలకు అయితే గ్రామాల్లో ప్రత్యేకంగా కార్యాలయాలు లేవు. మైదాన ప్రదేశాలే వీటికి కేంద్రాలు.

కేంద్రాలు పెరుగుతున్నా... సౌకర్యాలు శూన్యం.. : అధికారులకు కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపుపై ఉన్న ధ్యాస వసతుల కల్పనపై లేదు. ప్రతిసారి మెరుగైన వసతల కోసం చర్యలు తీసుకుంటామని చెబుతున్నా.. చర్యలు మాత్రం శూన్యం. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఎలాంటి ప్లాట్‌పారమ్‌లు నిర్మించలేదు. తేమ లేదని చెబితే మళ్లీ వెనక్కి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రాల వద్ద మైదాన, బహిరంగ ప్రదేశాల్లో ఆరబెడితే వర్షం ఎప్పుడు వస్తుందో తెలియదు. ఇప్పటికైనా వసతులు కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.



ప్లాట్‌ఫారంలు ఏర్పాటు చేయాలి.. : ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్లాట్‌ఫారం, రేకుల షెడ్లు నిర్మించాలి. సేకరణ ద్వారా వస్తున్న కమీషన్ డబ్బుల్ని సౌకర్యాల కోసం వినియోగించాలి. ధన్వాడ సింగిల్‌విండోలో ప్రతిసారి ప్లాట్‌ఫారంలు, వే బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు.
- లక్ష్మారెడ్డి రైతు, హన్మన్‌పల్లి



కల్లాల పథకాన్ని పునరుద్ధరించాలి : గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా పూర్తి రాయితీతో కల్లాలను మంజూరు చేశారు. ఈ పథకాన్ని తొలగించడంతో రెండేళ్ల నుంచి ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కల్లాల మంజూరు పథకాన్ని పునరుద్ధరించాలి.
- వెంకట్రాములు, రైతు, ధన్వాడ

ఆదేశాలు జారీ చేశాం.. : అన్ని కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సూచనలిస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తాం.
- దేవదాసు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, నారాయణపేట

పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుందాం: ఎస్పీ



పోలీసు పరేడ్ మైదానంలో సాయుధ బలగాల సన్నాహక ప్రదర్శన

నారాయణపేట, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని ఎస్పీ యోగేశ్ గౌతం పిలుపునిచ్చారు. అక్టోబర్ 21నుంచి 31వరకు పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో అమరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించడంతోపాటు శోక్‌శ్రస్త్ర పరేడ్‌ను అదనపు ఎస్పీ రియాజ్ హుల్‌హక్ ఆధ్వర్యంలో ఆర్ఐ నర్సింహా పరేడ్ కమాండర్‌గా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు హాజరై అమరులకు నివాళులర్పించనున్నారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లాగ్ డే సందర్భంగా జిల్లా పరిధిలోని ఔత్సాహిక ఫొటో, వీడియో గ్రాఫర్లకు షార్ట్ ఫిలీం, ఫోటోగ్రఫి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, పోలీసులకు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. వీటితోపాటు జిల్లా పోలీసు కళాబృందం సభ్యులచే పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సాయుధ బలగాల సన్నాహక ప్రదర్శన.. : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్‌హక్ ఆధ్వర్యంలో సాయుధ బలగాలు సన్నాహక ప్రదర్శనలు నిర్వహించారు.

సంపద వనం.. మొక్కలు కనం!



కుమ్మెర వద్ద పాలమూరు - రంగారెడ్డి పంపుహౌస్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంపద వనం బోర్డు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జలాశయాల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున సంపద వనాల పేరుతో మొక్కలను నాటినా. . నిర్వహణ లేక లక్ష్యం నీరుగారుతోంది. ఏడాది క్రితం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన దశాబ్ది సంపద వనాలు గడ్డిలో కలిసిపోయాయి. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర శివారులో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుహౌజ్, జలాశయం వద్ద సంపద వనాన్ని ఏర్పాటు చేశారు. ఎకరానికి 800 మొక్కల చొప్పున నాటారు. కుమ్మెర పంపుహౌజ్ వద్ద 38 ఎకరాల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన తర్వాత మళ్లీ పట్టించుకోలేదు. ఫలితంగా కొన్ని ఎండిపోగా మరికొన్ని పూర్తిగా గడ్డిలో కలిసి పోయాయి. ఉపాధి హామీ పథకం కూలీలతోనైనా మొక్కలకు నీటిని పట్టించడం, సంరక్షణ చర్యలు చేపట్టలేదు. జలాశయాల్లో పనిచేసే ప్రాజెక్టు అధికారులు, గుత్తేదారులు వాటి వైపు చూడలేదు. దీంతో అవన్నీ మొక్కుబడిగా మారాయి.

సంరక్షణకు చర్యలు.. : జలాశయాల వద్ద స్థల లభ్యత దృష్ట్యా అక్కడ అధికంగా మొక్కలు నాటే ప్రక్రియను గతేడాది చేపట్టాం. కొన్ని ప్రాజెక్టుల పరిధిలోకి కూలీలు, ఇతరులు వెళ్లేందుకు కొన్ని సార్లు అనుమతి ఉండదు. బ్లాస్టింగ్ పనుల దృష్ట్యా ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా మొక్కలను సంరక్షించాలని ప్రాజెక్టు సిబ్బందికి సూచించాం. జలాశయాల ప్రాంతాల్లో ఉండే గ్రామీణాభివృద్ధి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపడతాం.
- చిన్న ఓబులేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, నాగర్‌కర్నూల్

పత్తి అమ్మకానికి దారేదీ?

ఆన్‌లైన్‌లో నమోదు కాక కౌలురైతులకు పాట్లు



పాలమూరులో ఓ జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తితో వచ్చిన వాహనాలు



మహబూబ్‌నగర్, ఈనాడు : ఉమ్మడి జిల్లాలో 2,87,625 మంది చిన్న, సన్నకారు రైతులు, 26,760 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 70 శాతం వరకు రైతులు తమ సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 6.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సుమారు 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తోంది. బయటి మార్కెట్‌లో పత్తి పంటకు సరైన ధర రావటం లేదు. ఈసారి క్వింటా పత్తికి సీసీఐ రూ. 7,521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ఆ ధర పొందుదామంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులకు ఏం చేయాలో పాలు పోవటం లేదు.

సాంకేతిక సమస్యలు : వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో ఏ పంటలు, ఎవరు సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కౌలు రైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరునే నమోదు చేశారు. దళారుల కట్టడికి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట సాగు చేసినట్లు ఎవరి పేరు నమోదు చేసి ఉంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు, పాసు పుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. కౌలు రైతులు సీసీఐకి వెళ్లి పత్తి పంట అమ్ముకోవాలంటే పట్టాదారు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకంతో కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ఇందుకు పట్టాదారులు అంగీకరించటం లేదు. ఈ పరిస్థితిలో కౌలు రైతులు తమ పంట మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

గత్యంతరం లేక ప్రైవేటుకు : ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ 28 జిన్నింగ్ మిల్లులను గుర్తించింది. ప్రస్తుతం అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. రైతులు తీసుకొచ్చే పత్తిని మాత్రం తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో లేదని, ఇతర కారణాలు చెప్పి కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లు వాళ్లకే తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. కొన్ని చోట్ల జిన్నింగ్ మిల్లులకు సీసీఐ అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

గ్రామాల్లోకి దళారులు.. : సీసీఐ కేంద్రాల్లో చాలా మంది కౌలు రైతుల పత్తి కొనుగోలు చేయకపోవటంతో దళారుల దృష్టి వారిపై పడింది. ఇప్పటికే గ్రామాల్లో అడ్డావేసి తాము పంటను కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. పంట తడిసిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని క్వింటాకు రూ. 4,500 నుంచి రూ. 6వేలే ధర చెల్లిస్తున్నారు. దీనిపై సీసీఐ మహబూబ్‌నగర్ డీజీఎం మహేశ్వర్‌రెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పత్తి సాగు చేసినట్లు నమోదైన వారు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకంతో పంట తీసుకొస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. వారు కౌలు రైతా, పట్టా రైతా అనేది తాము చూడమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ.. సాగులో కౌలు రైతు ఉన్నా పట్టాదారు పేరునే నమోదు చేస్తామని వెల్లడించారు. పట్టాదారుడితో కౌలుదారులు సమన్వయం చేసుకుని వారి పంట విక్రయించుకోవాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)-1 పరీక్షలు ఉమ్మడి జిల్లాలో సోమవారం ప్రారంభం కానున్నాయి. అన్ని జిల్లాల్లో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు జిల్లాల్లో డీఈవోల ఆధ్వర్యంలో డీసీఈబీ కార్యదర్శులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 4,187 పాఠశాలల్లో 1-10 తరగతి చదువుతున్న 5,42,536 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. పాఠశాల విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే కాలపట్టికను తయారు చేసి పాఠశాలలకు డీఈవోల ద్వారా పంపింది. ఈ నెల 21 నుంచి 28 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు.

పాఠశాలలకు చేరిన ప్రశ్నపత్రాలు.. : ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రశ్నపత్రాలను ఆయా జిల్లాల ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ద్వారా ఎంఈవోలకు అందజేశారు. ఉదయం 6, 8, 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 7, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 21 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6, 8 తరగతుల విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28 వరకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7, 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

జిల్లా వివరాలు..

ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
359	152	139	91,325

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..






ధరూరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయి. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లే వారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణా శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అవగాహన లేక దళారులను ఆశ్రయించి అధిక మొత్తం సొమ్ము ఖర్చు చేసుకుంటున్నారు. అసలు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలంటే..

విద్య కోసం: ఉన్నత విద్య అభ్యసించటానికి అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యాతో పాటు పలు దేశాలకు వెళ్తుంటారు. ఆయా దేశాలకు వెళ్లిన వారు గ్రీన్ కార్డు హోల్డర్లుగా మారి అక్కడే స్థిర పడుతుండగా మరి కొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరి అయ్యింది. ఈక్రమంలో చాలా మంది ఐడీఎల్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

లెర్నింగ్ మాదిరిగా..: రాష్ట్ర రవాణా శాఖ జారీ చేసే అంతర్జాతీయ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. ఆయా దేశాల వాహనాలు నడపటానికి అనుమతి ఇస్తారు. ఒక రకంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాల్లో ఏడాది కాలం లెర్నింగ్ లైసెన్స్‌గా చెల్లుబాటవుతుంది. నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

పొందడం ఇలా

- అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్టు (కనీసం 6 నెలల గడువుతో) మనం ఏ దేశానికి వెళ్తున్నామో దానికి సంబంధించిన వీసా జతచేయాలి. వీసా తర్వాత వస్తుందని అనుకుంటే అందుకు సంబంధించిన ఇతర ఆధారాలు అందజేయాలి.
- ఆరోగ్య పరంగా వైద్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఫాం-ఏ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్ని సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు.
- ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు 1,250 వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు.




అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ నమూనా

అమెరికాలో నిబంధనలు కఠినం: అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలుంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవటానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాలి. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించే సమయంలో ఎంవీఐ పక్కన కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన ఛోదనను పరిశీలించి ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఏవైనా పొరపాట్లు చేస్తే వాటికి రుజువు చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

మనింట్లోనూ స్మార్ట్ జాంబీలు

- బాని'సెల్' అవుతున్న చిన్నారులు
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు




అన్నం తినడానికి, అల్లరి చేయకుండా కుదురుగా కూర్చోవడానికి గద్వాల పట్టణానికి చెందిన ఓ తల్లి కుమారుడికి చరవాణి ఇచ్చేది. ఒకటో తరగతికి వచ్చిన ఆ పిల్లాడు ప్రస్తుతం ఫోన్ ఇవ్వకపోతే అందరినీ కొడుతున్నాడు. గట్టిగా ఏడుస్తున్నాడు. చేసేది లేక మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు.

ఉమ్మడి జిల్లాలో ఓ మండలానికి చెందిన ఏడో తరగతి బాలుడు ఇంట్లో అందరూ నిద్రించాక రాత్రి ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు, తండ్రి ఫోన్ తీసుకొని గంటల తరబడి వాడటంతో ఆలస్యంగా నిద్రలేచేవాడు. దీనివల్ల కంటి సమస్య, చికాకు, నీరసం వంటి సమస్యలు వచ్చి చదువులో వెనుకబడ్డాడు.

రాజోలి, న్యూస్‌టుడే: పాలు తాగే పిల్లలు ఆకలితో ఏడిస్తే కన్నతల్లి దగ్గరకు తీసుకొని కడుపు నింపేది. భయంతో ఏడిస్తే నేనున్నాని భరోసా నింపుతూ ఎత్తుకొని లాలించేవారు. చందమామను చూపిస్తూ.. గోరు ముద్దలు తినిపించే వారు.. కథలు చెబుతూ.. పాటలు పాడుతూ నిద్ర పుచ్చేవారు. స్మార్ట్‌ఫోన్ పుణ్యమాని ఇవన్నీ మాయమైపోయాయి. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. పిల్లాడు మారాం చేస్తే చాలు సెల్‌ఫోన్ చేతిలో పెడితే ఏడుపు ఆగిపోతోంది. పిల్లలు గంటల తరబడి స్క్రీన్ టైం గడుపుతూ వాటికి బానిసలై 'స్మార్ట్ జాంబీలు'గా మారిపోతున్నారు. ఆటలు ఆడుతూ గడపాల్సిన బాల్యం, చరవాణిలో బందీ అవుతోంది.

ఇవీ అనర్థాలు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు మానసిక వైద్యుల వద్దకు తీసుకొస్తున్న పిల్లల్లో సింహభాగం సెల్‌ఫోన్ బాధితులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పిల్లలు రోజూ 3 - 4 గంటలు చరవాణి చూడటం వల్ల మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, 5 ఏళ్ల లోపు చిన్నారులు రోజుకు ఒక గంట కంటే ఎక్కువ ఫోన్ చూడకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. స్మార్ట్ స్క్రీన్ నుంచి విడుదలయ్యే బ్లూ లైట్ వారి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని, రేడియేషన్ ప్రభావంతో నెగెటివ్ ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

10 నుంచి 15 ఏళ్లలోపు 100 మంది పిల్లల సర్వేలో తేలిన అంశాలివి



సర్వేలు, పరిశోధనలు చెబుతున్న నిజాలివి



- ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 99 శాతం మంది మొబైల్‌ఫోన్లు, గాడ్జెట్లకు అలవాటు పడుతున్నారు.
- దేశంలో 66 శాతం మంది తల్లిదండ్రులకు తమ పిల్లలు అధిక స్క్రీన్ సమయం వెచ్చిస్తుండటం ప్రమాదకరమని తెలియదు.
- ఓ అధ్యయనం ప్రకారం 65 శాతం కుటుంబాలు తమ పిల్లలు అన్నం తినడానికి ఫోన్లు, టీవీలు చూపిస్తున్నారు.
- 12 నెలల వయసున్న పిల్లలు రోజుకు 53 నిమిషాలు స్మార్ట్‌ఫోన్ చూస్తున్నారు. 3 సంవత్సరాల పిల్లలు గంటన్నరకు పైగా చూస్తున్నారు.
- చరవాణి అతిగా వాడే పిల్లల్లో మెదడు, వినికిడి, మాట్లాడే సామర్థ్యంపై ప్రభావం పడుతుందని వెల్లడైంది. ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని వారు కోల్పోతున్నారు.



తల్లిదండ్రులు ఏం చేయాలంటే...



- పిల్లలకు వీలైనంత వరకు డిజిటల్ తెరలకు దూరంగా ఉంచడమే శ్రేయస్కరం. శారీరక శ్రమ కలిగించేలా ఆటలు ఆడించడం, నైపుణ్యాలను పెంచే విధంగా తల్లిదండ్రులు వారికి సూచనలు చేయాలి. నెమ్మదిగా ప్రయత్నిస్తే ఇది సాధ్యమే.
- పిల్లలున్న సమయంలో తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ వాడకపోవడం మంచిది. లేదంటే పెద్దలు చూసే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, రీల్స్‌కు త్వరగా అలవాటు పడతారు. ముఖ్యంగా గేమ్స్ ఆడకుండా చూడాలి.
- బడి నుంచి ఇంటికి రాగానే దగ్గరుండి వారితో హోమ్‌వర్క్ చేయించాలి. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి తరచూ పిల్లలకు వివరించాలి.

కుంగుబాటుకు కారణం



స్మార్ట్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపే వారు ఎవ్వరితో మాట్లాడరు. ఆడుకోరు. తల్లిదండ్రులతో అరవడం, వాగ్వాదం చేస్తుంటారు. మానసికంగా కుంగిపోతారు. సెల్‌లో గేమ్స్ ఎక్కువగా ఆడటం వల్ల డిప్రెషన్‌లోకి వెళ్తారు. ఈ మధ్య ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. తల్లిదండ్రులు ఆటలు ఆడించడం, వారితో కలసి ఆడటం, తోటి పిల్లలతో కలిసేలా చేయడం తదితరాలు చేయాలి.

-డా.హేమలత, మానసిక వైద్య నిపుణురాలు, గద్వాల

జాతీయ సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి రజతం


కె.కార్తిక్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 5వ సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా వాసికి రజతం దక్కింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కె.కార్తిక్ హెప్టఅత్లాన్ విభాగంలో ప్రతిభ చాటి రజతం కైవసం చేసుకున్నాడు. రాష్ట్రానికి రజతం సాధించిన అథ్లెట్‌ను అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి జి.శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్ర కుమార్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేశ్ చందర్, సభ్యులు ఆనంద్, సాదిఖ్, సునీల్ తదితరులు అభినందించారు.

23న పీయూలో క్రీడాకారుల ఎంపికలు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి రెండు రోజుల పాటు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పీడీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్‌జోన్, అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు సంబంధించి బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో 23న, మహిళల క్రికెట్ 25న, అదే రోజు క్రాస్ కంట్రీ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 17 నుంచి 25 వరకు ఉండాలన్నారు. ప్రస్తుతం వివిధ కళాశాలల్లో చదువుతున్న అభ్యర్థులు, తమ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యం




పరుగు ప్రారంభోత్సవంలో క్రీడాజ్యోతితో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆదివారం సీఎం కప్ క్రీడా జ్యోతి జిల్లాకు చేరుకోగా స్వాగతం పలికి, క్రీడా జ్యోతి పరుగును కలెక్టర్ ఎస్పీ డి.జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌తో కలసి ప్రారంభించారు. ఈ పరుగు డీఎస్‌ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ డైట్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీఎం కప్ క్రీడా టోర్నీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఈ సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సాట్స్ ప్రతినిధులు రతన్‌బోస్, గోకుల్ యాదవ్, సాయిబాబా, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు ప్రాణత్యాగాలు

ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు



న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నేరవిభాగం

శాంతి భద్రతలు, ప్రజల రక్షణకు.. రాత్రింబవళ్లు పని చేసేది పోలీసులే. ప్రజలంతా హాయిగా నిద్రపోతుంటే వారు గస్తీ కాస్తుంటారు. అందరూ పండగ చేసుకుంటే వారు బందోబస్తులో తలమునకలుగా ఉంటారు. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఉమ్మడి జిల్లాలో 39 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారు. అలాంటి పోలీసుల సేవలు, త్యాగాలను గుర్తు చేసుకుని వారికి నివాళి అర్పించేందుకు ఏటా అక్టోబర్ 21న **'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం'** నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1990-2000 మధ్య కాలంలో మావోయిస్టుల ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. అచ్చంపేట, అమ్రాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, గద్వాల, వనపర్తి, వీపనగండ్ల, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, కొత్తకోట, మక్తల్, కృష్ణ, వెల్దండ, వంగూరు, బల్మూరు తదితర ప్రాంతాల్లో మావోయిస్టు దళాలు ఉండేవి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. మావోలు గుర్తించకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సాధారణ దుస్తుల్లోనే విధులు నిర్వహించేవారు. ప్రత్యేక వాహనాల్లో ప్రయాణించేవారు కాదు. ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగించేవారు. మందుపాతరలు, ఎదురుకాల్పులు సర్వసాధారణం. ఎప్పుడు ఎక్కడ ఏ ఘటన జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట సమయంలో పోలీసులు ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారు.

బస్సును పేల్చిన ఘటనలో..

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టులు జరిపిన దాడుల్లో అతి పెద్ద ఘటన సోమశిలదే. కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద కొందరు మావోయిస్టులు 1993 నవంబర్ 13న ఆర్టీసీ బస్సును దగ్ధం చేయటంతో పాటు అక్కడే ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని మందు పాతరతో పేల్చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించడానికి 14వ తేదీన అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశీ నాయుడు, వనపర్తి డీఎస్పీ, ఇద్దరు ఎస్సైలు, 30 మంది వరకు పోలీస్ సిబ్బంది ఒక ప్రైవేటు బస్సులో వెళ్లారు. బస్సు టాప్‌పై ఉన్న ఆయుధాలను గమనించిన మావోయిస్టులు అందులో ఉన్నది పోలీసులేనని నిర్ధారించుకున్నారు. సోమశిలకు వెళ్లి వివరాలను తెలుసుకున్న ఎస్పీ, పోలీసులు తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మందుపాతరతో బస్సును పేల్చేశారు. వెంటనే కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎస్పీ పరదేశీ నాయుడుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఆరుగురు పోలీసులు మృతిచెందారు. ఈ ఘటన అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సంచలనంగా మారింది. 1997 మే 17న అమ్రాబాద్ నుంచి ఎస్సై మన్సూర్ తన సిబ్బందితో కలిసి జీపులో వెళ్తుండగా అదే మండలంలోని లక్ష్మాపూర్ వద్ద మావోయిస్టులు మందు పాతరతో వాహనాన్ని పేల్చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో నలుగురు పోలీసులు చనిపోయారు. 2015లో సూర్యాపేట ఆర్టీసీ బస్టాండులోని ఓ బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో జడ్చర్లకు చెందిన ఎస్సై సిద్దయ్య అసువులు బాశారు. ఇలా అనేక ఘటనల్లో పోలీసులు ప్రాణత్యాగం చేశారు. వారిని స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్‌తో పాటు వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ నేపథ్యంలో ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఎండీసీఏ మైదానంలో 21 నుంచి 28 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, కొడంగల్ జట్లు పాల్గొంటున్నాయి. పూల్-ఏలో మూడు, పూల్-బిలో మూడు జట్లను విభజించి ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌ల చొప్పున ఆడాల్సి ఉంటుంది. ఈ వన్డే టోర్నీలో పూల్-ఏ విన్నర్‌తో పూల్-బి విన్నర్ జట్టు ఫైనల్‌లో తలపడతుంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేయనున్నారు. ఎంపికయ్యే ఉమ్మడి జిల్లా జట్టు నవంబర్ 4వ తేదీ నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి హెచ్‌సీఏ టోర్నీలో పాల్గొంటుంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాలమూరుకు ద్వితీయ స్థానం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్ కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్ బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వంగూరు, న్యూస్‌టుడే : డిండి ఎత్తిపోతల (డీఎల్ఐ) కాలువ పనుల్లో భాగంగా మండలంలోని నర్సంపల్లి గ్రామ సమీపంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఆదివారం బ్లాస్టింగ్ సందర్భంలో అదే గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. నర్సంపల్లి గ్రామానికి చెందిన డేరంగుల శ్రీను, కృష్ణవేణి దంపతుల కుమారుడు రిషితేజ వంగూరులో 10వ తరగతి చదువుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న డీఎల్ఐ కాలువ పనుల వద్ద గుత్తేదారుడు బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు చాలా దూరం వేగంగా వచ్చి పడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రిషితేజకు ఓ రాయి వేగంగా వచ్చి తగిలింది. చేతికి తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ శైవక్షేత్రం దక్షిణకాశీ బాలబ్రహ్మేశ్వర స్వామి, అయిదో శక్తిపీఠమైన జోగులాంబ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలి వచ్చారు. స్వామికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబ అమ్మ వారికి త్రిశతి, ఖడ్గమాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆలయాల సమీపంలోని తుంగభద్ర నదిలో పడవలో చెక్కర్లు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. పుష్కర్ ఘాట్ నుంచి నది పరవళ్లను తిలకించారు.


జోగులాంబ ఆలయంలో భక్తులు

27న అన్నమాచార్య సంకీర్తనాలాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం తిరుమలదేవుడి గుట్టలో వెలసిన శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 54 సంకీర్తనల గానాలాపన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టనున్నట్లు గాయకుడు, అన్నమయ్యవాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు గద్వాల చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. లోకకల్యాణార్థం 27వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గానకచేరి ఉంటుందని తెలిపారు.

సిగరెట్ల ఏజెన్సీలో భారీ చోరీ

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్లలో దొంగలు తెగబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సిగరెట్ల ఏజెన్సీ తాళాలు ధ్వంసం చేసి భారీ మొత్తంలో సిగరెట్లను గూడ్స్ వాహనంలో తీసుకెళ్లారు. బాధిత వ్యాపారి, ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీప కాలనీలో విఘ్నేశ్వర ఏజెన్సీకి సంబంధించిన హోల్‌సేల్ దుకాణం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు గూడ్స్ వాహనం తీసుకొచ్చి దుకాణం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. వివిధ బ్రాండ్లకు చెందిన 32 కార్టన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లారు. ఉదయం 6 గంటలకు ఏజెన్సీ ఎదుట కిరాణం నిర్వహించే వ్యాపారి.. తాళం ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చారు. దుకాణం సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా తెల్లవారుజామున 3 గంటల తర్వాత దొంగలు గూడ్స్ వాహనంలో వచ్చి సిగరెట్ల కార్టన్లు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. రూ.32 లక్షల విలువైన సిగరెట్లు పోయాయని బాధితుడు మణికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇదే ఏజెన్సీలో రెండేళ్ల క్రితం రూ.5లక్షల విలువైన సామగ్రి, నగదు అపహరించారు.


సీసీ కెమెరా ఫుటేజిలో గూడ్స్ వాహనంలో సిగరెట్ల కార్టన్లు పెడుతున్న దొంగలు

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00



మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



సమస్య: మండలంలోని కాన్‌కుర్తిలో హనుమాన్ దేవాలయం ఏరియాలో మురుగుకాలువలు లేక నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది.
- పూజారి నారాయణ్ చారి వ్యాపారి కాన్‌కుర్తి

సమాధానం: కాన్‌కుర్తిలో మురుగుకాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి నూతన కాలువల నిర్మాణం చేయిస్తాం.
- రాజేష్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: విఠలాపూర్- మొగుళమడ్క రోడ్డు కోతకు గురై అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
-భీమప్ప విఠలాపూర్

సమాధానం: రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.
- సాయిలక్ష్మి ఎంపీడీవో దామరగిద్ద

సమస్య: దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లి ఉర్దూ పాఠశాల అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది.
- చాంద్‌పాషా క్యాతన్‌పల్లి

సమాధానం: అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం నిధులు మంజూరు కాగానే పూర్తి చేస్తాం.
-సాయిలక్ష్మి ఎంపీడీవో

- న్యూస్‌టుడే, దామరగిద్ద

తెరపై ఈనాడు

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : వనయాంబ : దేవర
వెంకటరమణ : దేవరా, రాఘవేంద్ర : విశ్వం

మందుల కొరత.. రోగుల అవస్థ

తప్పని ఆర్థికభారం

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ప్రైవేట్ ఆస్పత్రుల నిలువు దోపిడీని తట్టుకోలేక నిరుపేదలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే అక్కడ మందుల కొరత వేధిస్తోందని కోస్గి ధర్మాస్పత్రికి వచ్చే రోగులకు ఆర్థికభారం తప్పడంలేదని వారు వాపోతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి సామాజిక ఆస్పత్రులను వైద్యవిధాన పరిషత్‌లో విలీనం చేసినా అవసరం మేరకు వైద్య సిబ్బంది లేరని కోస్గి ఆస్పత్రికి ఓపి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో తాత్కాలిక సిబ్బందిని నియమించారు. కానీ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం మందులను పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదని, మందుల నిల్వలు తక్కువగా ఉన్నాయని బహిరంగమార్కెట్లో తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు ఆర్థికభారం తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి కోస్గి ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని ఆస్పత్రికి వచ్చేవారు కోరుతున్నారు.




కోస్గి ప్రభుత్వ ఆస్పత్రి

తనిఖీలు పెరిగినా...!

30 పడకల సామాజిక ఆస్పత్రిగా కొనసాగుతున్న కోస్గి ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల స్థాయి పెంపుతో రెండున్నరేళ్ల క్రితం వైద్యవిధాన పరిషత్‌లో విలీనం చేశారు. ఆస్పత్రికి నిత్యం 250 నుంచి 300మంది రోగుల తాకిడి ఉంటుంది. కానీ ఈ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది సంఖ్య పెంపు రెండున్నరేళ్లుగా చేపట్టకపోవడంతో వైద్యసేవలు ఆశించినస్థాయిలో అందడంలేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులపై కలెక్టర్, అదనపు కలెక్టర్లు, వైద్యాధికారులు తనిఖీలు చేపట్టినా ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పన, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. అనుదీప్‌ను వివరణ కోరగా.. తాత్కాలిక సిబ్బందిని నియమించారని ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మందుల నిల్వల్లో తేడా లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ పెడుతున్నామని వివరించారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన నాగురావు నామాజీ



నారాయణపేట, న్యూస్‌టుడే : హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆదివారం భాజపా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ చండీగఢ్ రాజ్‌భవన్‌లో కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను శాలువాతో సత్కరించారు. భాజపాలో ఎన్నో ఏళ్లుగా కలిసి పనిచేశామని, ప్రస్తుతం గవర్నర్‌గా పనిచేస్తున్న దత్తాత్రేయను కలవడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

ధన్వాడ ప్రీమియర్ లీగ్ విజేతగా ఆర్జే-11 జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడ ప్రీమియర్ లీగ్ సీజన్-2 విజేతగా ధన్వాడకు చెందిన ఆర్జే -11 జట్టు నిలిచింది. పక్షం రోజుల క్రితం ప్రారంభమైన ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆర్జే-11, పాతపల్లికి చెందిన విక్రమ్-11 జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో ఆర్జే-11 జట్టు విజయం సాధించింది. విజేతకు రూ. 50వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్‌కు ట్రోఫీతో పాటు రూ.25వేల నగదును అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, భాజపా కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు రాంచంద్రయ్య, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుంకు ఉమేష్‌కుమార్ గుప్తా, భాజపా మండలాధ్యక్షుడు మాకం సురేందర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న విశ్రాంత పీఈటీ బి.గోపాలం

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దానిసింగ్, బి.గోపాలం జెండా ఊపి ప్రారంభించారు. విశ్రాంత పీఈటీ బి.గోపాలం మాట్లాడుతూ.. 14, 16, 18 ఏళ్ల వయస్సుల విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో 250మంది బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జనగామ జిల్లాలో నిర్వహించే సైక్లింగ్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు అంజిత్, దామోదర్, రమేష్, సౌమ్య, రేణుక, పుష్పలత, మీనాకుమారి, శ్రీలత, స్వరూప, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో విశ్వశాంతి మహాయజ్ఞం

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పస్పుల గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన వెలసిన వల్లభాపుర దత్తక్షేత్రంలో మహాసంస్థాన పీఠంలో ఆదివారం శాంతి మహాయజ్ఞం ప్రారంభించారు. సప్త సముద్ర పేరు శ్లోకాలతో గురు చరిత్ర సప్తాహిక హోమం వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. హోమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మాతా నిరంజన, నిత్యశుద్ధానందస్వామి, రామలింగారెడ్డి, జగదీష్, శంకరయ్య, దత్తప్ప, భక్తులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించండి


ఎమ్మెల్సీ ఏవీయన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం చెల్లించాలని, ఏళ్లుగా ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఏవీయన్‌రెడ్డికి తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నరసింహ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం సమస్యలపై వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కేజీబీవీలలో కేర్ టేకర్లను నియమించాలని, వ్యాయామ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంల వేతనాల వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తపస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిమాత కుంభోత్సవం

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో దేవాంగసమాజ్ ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారి కుంభోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం పాలమూరు గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 విభాగంలో కరాటే పోటీలలో ప్రతిభ కనబర్చారు. స్రవంతి, కార్తీక్‌లు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల బృందం, కరాటే సిబ్బంది ఉన్నారు.

జీవో 29ని రద్దు చేయాలి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న జీవో 29ని తక్షణమే రద్దు చేయాలని డీటీఎఫ్ నారాయణపేట జిల్లా నాయకురాలు హైమావతి డిమాండ్ చేశారు. మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ జీవోతో అణగారిన వర్గాల వారు ఓపెన్ కేటగిరీలో ఉద్యోగాలు సాధించినా రిజర్వేషన్ల కేటగిరి కిందకు వస్తాయన్నారు. జీవో 55ప్రకారం ఎంపికలు జరపాలని ఆమె డిమాండ్ చేశారు. డీటీఎఫ్ నాయకులు పరంధాములు, స్పందన, సూర్యచంద్ర, మౌనిక పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్

నారాయణపేట, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.యాదగిరి డిమాండ్‌చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15వేలు, రుణమాఫీ, రైతుబీమా, వ్యవసాయ పంటలకు కేంద్రం ఇచ్చిన ఎంఎస్‌పీతోపాటు రూ. 500ల బోనస్ అమలుచేయడంలేదన్నారు. హామీలు అమలుచేయని పక్షంలో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.





మద్దూరు: రాస్తారోకోలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.. దామరగిద్ద: అంబేడ్కర్ చౌరస్తాలో.. కోస్గి శివాజీ కూడలిలో.. నారాయణపేటలో భారాస నేతలు

రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సిందే: భారాస


మక్తల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

వానాకాలం సీజన్ ముగుస్తున్నప్పటికీ రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆదివారం భారాస అధిష్ఠానం పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. పదేళ్ల భారాస హయాంలో కేసీఆర్ ఏనాడు రైతులకు పెట్టుబడి సాయం ఆపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే పెట్టుబడి సాయం ఈ ఏడాది ఇవ్వబోమని చెప్పడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల్లో ఒక్కటి సరిగా అమలు చేయలేదని, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో భారాస ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. దామరగిద్ద మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద భారాస పార్టీ అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కోస్గి శివాజీ కూడలి వద్ద భారాస నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ శాసం రామకృష్ణ, కౌన్సిలర్ జనార్ధన్‌రెడ్డి నాయకులు ఉన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రం సత్యనారాయణ కూడలిలో ధర్నా చేపట్టారు. భారాస పట్టణ అధ్యక్షుడు చెన్నారెడ్డి, మండల అధ్యక్షుడు రాములు ఉన్నారు. రైతులకు రైతు భరోసా తక్షణమే ఇవ్వాలని భారాస మండలాధ్యక్షుడు వి. మహేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్వలోని అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేసి మాట్లాడారు. మరికల్ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్యదర్శి అశోక్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ రవికుమార్ ఉన్నారు. ధన్వాడ మండలంలోని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించిన నాయకులు ఆ తర్వాత మహబూబ్‌నగర్, నారాయణపేట ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సుధీర్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మక్తల్, నారాయణపేట, ధన్వాడ, మరికల్, నర్వ, మద్దూరు, కోస్గి, దామరగిద్ద




నర్వలో.. ధన్వాడలో మహబూబ్‌నగర్-నారాయణపేట రోడ్డుపై.. మరికల్ : జాతీయ రహదారిపై..

ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ నిరంతర కృషి



మాట్లాడుతున్న పీఆర్టీయూ పేట జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ నిరంతరం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా. లక్ష్మీనారాయణ సహకారంతో పీఆర్‌టీయూ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అనిల్‌గౌడ్, పల్లె వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విధూర్‌కుమార్, శ్రీనివాసరావు, పుట్ట మారుతి, గోపాల్‌రెడ్డి, చింతకుంట రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా సేవలు చిరస్మరణీయం


దాదన్‌పల్లిలో పల్లకీసేవలో భక్తులు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : సత్యసాయిబాబా సేవలు చిరస్మరణీయం అని ట్రస్టు సభ్యులు సునీల్, మహేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని దాదన్‌పల్లి గ్రామంలో సత్యసాయిబాబా విగ్రహంతో పల్లకీసేవ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పాతికేళ్ల క్రితం ట్రస్టు ద్వారా పంప్‌హౌజ్ ఏర్పాటు చేసి 110గ్రామాలకు తాగునీరు అందించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి లక్ష్మి, ప్రతాప్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు రమేష్, జగదీష్, శేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి భాజపాతోనే సాధ్యం

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : గ్రామీణాభివృద్ధి భాజపాకే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మరికల్ మండలంలోని చిత్తనూర్ గ్రామంలో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకులు ప్రతాప్‌యాదవ్, దేవేందర్‌రెడ్డి, వాకిటి రామాంజనేయులు, టీచర్ భాస్కర్‌రెడ్డి, బాలరాజు, బన్నీయాదవ్, నరేష్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్తనూర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి



ధన్వాడలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు.. దామరగిద్ద: గురువులతో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2005-06 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక కన్వెన్షన్ హాలులో కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, జ్యోతి, శేఖర్‌రెడ్డి, బస్‌లింగప్ప, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, పార్వతమ్మ, నర్సింలు, నరేందర్‌లను ఆహ్వానించి సత్కరించారు.

దామరగిద్ద, న్యూస్‌టుడే : దామరగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయసమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గురువులను శాలువలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులు అధ్యాపకులు బీంరెడ్డి ఆధ్వర్యంలో సమ్మేళనం సాగింది.

ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు


హెచ్‌ఎంను శాలువా కప్పి సత్కరిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

నారాయణపేట, న్యూస్‌టుడే : పేట మండలం పిల్లిగుండ్ల తండా గ్రామపంచాయతీ పరిధి పాతతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శంకర్ ప్రసాద్‌కు విద్యార్థులు ఘన వీడ్కోలు పలికారు. బదిలీల్లో భాగంగా వెళ్లిన హెచ్‌ఎంకు ఆదివారం తండావాసులు, విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తండావాసులు రాందాస్‌నాయక్, బాలునాయక్, గనేశ్, తిరుపతి, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి


మరికల్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : ఈనెల 21న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ 57 కులాల సంఘం జిల్లా అధ్యక్షుడు పొర్ల లింగప్ప కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలోని యువకులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బండారి మల్లేష్ భీమరాజు, ఆశప్ప, వెంకటేష్, మహేష్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,467

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం నవాబ్‌పేటలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డుకు భారీగా మొక్కజొన్న, జొన్న ధాన్యం తరలివచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. మొక్కజొన్న 1,635 క్వింటాళ్లు, జొన్న 6 క్వింటాళ్లు వచ్చినట్లు చెప్పారు. మొక్కజొన్న గరిష్ఠంగా క్వింటా రూ. 2,467, కనిష్ఠంగా రూ. 2,330, జొన్న క్వింటా రూ. 2,012 ధర వచ్చినట్లు తెలిపారు. రైతులకు సకాలంలో ధాన్యం విక్రయాలు చేసినట్లు చెప్పారు.

వట్టెంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వట్టెంలోని వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : మండలంలోని మంతన్‌కోడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పిల్లి మల్లేష్ (23) వారం రోజుల కిందట అదృశ్యమయ్యారు. మల్లేష్ కొంత కాలంగా మతిస్థిమితం లేక ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 12న పేడను తీసుకొచ్చేందుకు గ్రామ శివారులోని కొత్త చెరువు సమీపంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం చుట్టుపక్కల రైతులు గ్రామ సమీపంలోని చెరువులో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించగా వారు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి అక్క జయమ్మ ఫిర్యాదు మేరకు నర్వ ఠాణాలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : లారీ ఢీకొని వృద్ధురాలికి గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన బైన్ల శంకరమ్మ ఈనెల 10న కూతురి వద్దకు హైదరాబాద్ వెళ్లారు. తిరిగి ఆదివారం జక్లేర్‌కు బస్సులో వచ్చి.. పులిమామిడి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా మహబూబ్‌నగర్ వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. సంఘటనలో శంకరమ్మకు తీవ్ర గాయాలు కావడంతో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఘటనపై కుమారుడు బైన్ల రఘు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతి..!



కృష్ణా మండల పరిధిలోని హిందుపూర్, కున్సి మధ్య రైల్వే అండర్ పాస్ వద్ద ఆదమరిస్తే ప్రాణాలు పోవడం ఖాయం. వంతెన కింద వర్షపునీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఇనుప షీట్‌లు తొలగిపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. దగ్గరకు వచ్చేంతవరకూ పొంచి ఉన్న ప్రమాదం కనిపించట్లేదు. కొద్ది రోజులుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాయచూరు, యాదగిరి జాతీయరహదారిపై నెలకొన్న సమస్యను ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఎన్‌హెచ్ అధికారులను 'న్యూస్‌టుడే' వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.
- న్యూస్‌టుడే, కృష్ణా

జారుతోంది.. జర జాగ్రత్త..!

ఊట్కూరు మండలంలోని మగ్దుంపూర్ గ్రామం నుంచి ఎర్గాట్‌పల్లి వెళ్లే రహదారి గుంతలతో బురదమయంగా అధ్వానంగా మారి వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురదలో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో 108 రావటం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరారు.
- న్యూస్‌టుడే, ఊట్కూరు

